క్లుప్తంగా

ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేతపై హర్షం

కడప ఎడ్యుకేషన్: వివిధ దశల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులపై గతంలో నమోదైన కేసులను ఎత్తివేస్తునట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకటజనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్ భాషా అన్నారు. దీంతో పాటు జీపీఎస్ అమలు చేస్తూ విడుదల చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని వారు కోరారు.

నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్: ట్రాఫిక్ నిబంధలను ప్రతి ఒక్కరూ పాటించాలని కడప ట్రాఫిక్ సీఐ జావిద్ పేర్కొన్నారు. కడప నగరంలోని గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలను తెచ్చుకోవద్దని హితవు పలికారు. ద్విచక్ర వాహనాలను అత్యంత వేగంగా నడుపుతూ యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థులు టూవీలర్ నడుపుతున్నప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పురుషోత్తమరెడ్డి, ప్రిన్సిపల్ జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమకు అన్యాయం చేయొద్దు


మాట్లాడుతున్న ఎన్.రవిశంకర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాయలసీమ ప్రాంతంలోని సంస్థలను అమరావతికి తరలించి అన్యాయం చేయవద్దని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్ రెడ్డి కోరారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై కోపంతో కరవు సీమలో హైకోర్టు ఏర్పాటు చేయకపోవడమేగాక, న్యాయ సంస్థలను తరలించడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మక్బూల్ బాషా, మడగలం ప్రసాద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాటమే ఓబుళయ్యకు ఘన నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంత పోరాటం చేయడమే ఓబులయ్యకు ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు నేత ఓబుళయ్య సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలంలో ప్రముఖ రాజకీయ నాయకులు భూస్వాములుగా ఉన్న సమయంలో వారికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నిర్వహించి ఓబుళయ్య ప్రజల పక్షాన నిలబడ్డారన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ప్రథమ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై వారి కోసం పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వెంకటశివ, ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎంవీ.సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, జి.వేణుగోపాల్, కేసీ.బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ పలితాల్లో ప్రతిభ


ప్రేమ్‌దీప్,


సూర్యవంశీ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎల్‌ఎల్‌బీ పరీక్షా ఫలితాల్లో కడప బసవరామతారకం మెమోరియల్ లా కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయిలో ప్రేమ్ దీప్(72 శాతం) ప్రథమ, సూర్యవంశీ(70శాతం)ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ జహీరుద్దీన్ తెలిపారు. వారిని కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ జహీరుద్దీన్ అభినందించారు.

నేడు ఎం.జె.మాణిక్యరావు సంస్మరణ సభ

వైవీయూ: కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల టీచర్స్ అసోసియేషన్ పితామహుడిగా ప్రసిద్ధి చెందిన ఎం.విజయ మాణిక్యరావు సంస్మరణసభ శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ప్రతినిధులు జీవీ.సుబ్బారెడ్డి, ఎస్.రాజేశ్వరరావు, పుల్లన్న, ఎస్ఎం.మహేశ్వరి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో అకడమిక్ ఫస్ట్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. శుక్రవారం కళాశాల చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి పల్లాకృష్ణ నోటిఫికేషన్ విడుదల చేశారు.

వాలీ బాలికలు.. గెలుపు కెరటాలు

చదువైనా.. క్రీడేదైనా.. రంగమేదైనా బాలికలు అడుగు పెట్టారంటూ విజయం వరించాల్సిందే. బంతి కొడితే పతకాల పంట పండాల్సిందే. మైదానంలో అడుగు పెడితే విజేతగా నిలవాల్సిందే. వారే కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల వాలీబాల్ క్రీడాకారిణులు. విజయనగరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో జట్టును విజయపథంలో నడిపించడమేగాక.. అండర్-14,17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

- రాణిస్తున్న వైఎస్సార్ క్రీడా పాఠశాల విద్యార్థినులు
- జాతీయ స్థాయి పోటీలకు ఏడుగురు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు సాధన చేస్తున్న క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో విద్యార్థినులు వాలీబాల్ పోటీల్లో భళా అనిపిస్తున్నారు. పాఠశాలలో చదువులో రాణిస్తూనే.. వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకున్నారు. నిత్యం సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటా తాజాగా జాతీయ స్థాయి జట్టులో స్థానం సంపాదించారు. ఈ ఏడాది నవంబర్ 9వ తేదీ నుంచి 12వతేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా బాలికలు ప్రత్యర్థులను ఓడించి జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించారు.

అత్యంత ప్రతిభ కనబరచిన టి.భువనేశ్వరి, బి.భార్గవి, ఎన్.నాగతనూజ, జి.సృజన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.ఆఫ్రీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్-19 విభాగంలో వి.కుసుమప్రియ విజయవాడలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించి జాతీయ జట్టులో స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా వారి ప్రస్థానంపై సాక్షి ప్రత్యేక కథనం.

సంతోషంగా ఉంది..


కె. శ్రీనివాసరాజు

వాలీబాల్ క్రీడ నుంచి ఏడుగురు క్రీడాకారిణులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడం సంతోషంగా ఉంది. ఎస్‌జీఎఫ్ గేమ్స్‌తో పాటు అసోసియేషన్, సౌత్ జోన్ పోటీల్లో సత్తా చాటారు. రానున్న రోజుల్లో ఉత్తమ ఆటతీరు కనబరిచేలా కృషి చేస్తాం.

– కె. శ్రీనివాసరాజు, వాలీబాల్ శిక్షకుడు, డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల, కడప

స్టేట్ ఛాంపియన్‌గా నిలిపి..

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ అండర్-14 బాలికల విభాగం స్టేట్ చాంపియన్‌లుగా నిలవడంలో నాగజ్యోతి, భార్గవి, సృజనగ్లోరీ, భువనేశ్వరి కీలక పాత్ర పోషించారు. నాగజ్యోతి నరసరావుపేట, వైజాగ్‌లలో నిర్వహించిన అండర్-14 స్టేట్‌మీట్‌లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. భార్గవి వైజాగ్‌లో జరిన సబ్ జూనియర్, అండర్-14 స్టేట్ మీట్ లోనూ జిల్లా జట్టుకు ప్రాతనిధ్యం వహించారు. భువనేశ్వరి వైజాగ్‌లో నిర్వహించిన స్టేట్ మీట్‌లోనూ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.తాజాగా విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో సృజన చక్కటి ఆటతీరును కనబరిచింది. జాతీయ స్థాయి పోటీలకు నలుగురూ ఎంపికయ్యారు.


టి. భువనేశ్వరి


నాగతనూజ


బి. భార్గవి


జి. సృజనా గ్లోరీ

అండర్-17 విభాగంలో.. జాతీయ జట్టుకు....

వైజాగ్ జిల్లా ఎలమంచిలిలో నిర్వహించిన సబ్ జూనియర్ స్టేట్ మీట్‌లో జిల్లా జట్టును విజేతగా నిలవడంలోనూ, చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడంలో క్రీడాకారిణి ఎస్.ఆఫ్రీన్, వి.నోమిత కీలకంగా వ్యవహరించారు. బంతితో తన సత్తా చాటి బంగారు పతకాలు దక్కించుకున్నారు. అదే విధంగా అండర్-14 విభాగంలో అనంతపురంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించారు. దీంతో ఆఫ్రీన్‌ను ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో నవంబర్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ ఎంపీ జట్టుకు ఎంపిక చేశారు. వి.నోమిత ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.


వి. నోమిత


ఆఫ్రీన్

అండర్-19 విభాగంలో.. రాణిస్తూ

విజయవాడలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటడంతో క్రీడా పాఠశాలకు చెందిన వి.కుసుమప్రియ జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈమె గతంలో అండర్-14, అండర్-17 విభాగాలతో పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని పతకాలు సాధించింది. అండర్-17 విభాగంలో రెండు మార్లు బంగారు పతకం సాధించారు.


వి. కుసుమప్రియ

అయ్యప్పస్వామి ఆలయ మంటపం ప్రారంభం


ఆలయ మంటపాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన మంటపాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ కోరిక మేరకు ఈ మంటపం నిర్మాణానికి రవీంద్రనాథ్‌రెడ్డి గతంలో రూ.6 లక్షల నగదు వితరణ చేశారు. దీంతో ఆయన చేతుల మీదుగా ప్రారంభించామని అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో దోపిడీ

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫీజు పేరుతో కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. కడప నగరంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజు వసూలు చేస్తున్నారని, అడిగినా విద్యార్థులకు రసీదులు ఇవ్వడం లేదని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మనోజ్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్: కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ వద్ద ఆచార్ల కాలనీలోని వెలసిన మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. కాశీ నుంచి వచ్చిన బ్రహ్మానందగిరిస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామున వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహాలకు అభిషేకం జరిపారు. విరాట్ విశ్వకర్మ భగవాన్, మాతా గాయత్రీదేవి చిత్ర పటాలను ప్రతిష్ఠించి, పూజలు చేశారు. మధ్యాహ్నం కార్తిక వన భోజనాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలను పల్లకిపై ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి జ్వాలాతోరణం కార్యక్రమం కనుల పండువగా సాగింది. నగర వాసులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

• ఆకలి తీరుస్తున్న అన్న దాత





అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్ని దానలా కన్నా అన్నదానం మిన్న.. ఇది తెలుసుకున్న కొందరు దాతలు కడప రిమ్స్ కు వచ్చే రోగుల ఆకలి తీరుస్తున్నారు మంగళ, శుక్ర వారాలలో అన్న దానం చేస్తూ తిన్న తరువాత వారి మన్ననలు పొందుతున్నారు ఈ దృశ్యాలు రిమ్స్ వద్ద సాక్షి కెమెరా తీసిన చిత్రాలివీ. - రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

వీడని వర్షం..

కడప కార్పొరేషన్: కడప నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, ఉద్యోగులు, వీధి వ్యాపారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నచౌక్‌లో వరదనీరు పోటెత్తడంతో గ్యాస్ పైపులైన్ పనులకు ఆటంకం కలిగింది. మద్రాసు రోడ్డులోని రెడ్డి కాలనీ సమీపంలో పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండు జలమయమైంది. కాలువ పనులు చేస్తూ మట్టినంతా రోడ్డుపై వేయడంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

సచివాలయంలో వర్షపు నీరు


కిటికీల్లోంచి నీరు

కడప కార్పొరేషన్: ఇటీవల కురిసిన వర్షాలకు కడప నగరం అశోక్ నగర్‌లోని 5/2 వార్డు సచివాలయంలోకి నీరు చేరుతోంది. పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో సచివాలయం ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైకప్పు, కిటికీల్లోంచి వర్షపు నీరు పడుతుండడంతో విధులు నిర్వహించడం కష్టంగా ఉందని సిబ్బంది తెలిపారు. ఫైళ్లు తడిసిపోవడంతోపాటు ఫర్నిచర్ పాడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

• ఉరుసుకు సిద్ధం


సుందరంగా దర్గా వీధులు


ఉరుసుకు ఏర్పాట్లు



కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాట్లు ఘనంగా సాగుతున్నాయి. - మహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానం అవసరం


శిక్షణలో పాల్గొన్న కడప ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఔషధాల తయారీ, ఆరోగ్య సంరక్షణ అంశంపై ఈ నెల 13వ తేదీ నుంచి జరుగుతున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ప్రభుత్వ పురుషుల కళాశాల, ప్రభుత్వం మహిళా కళాశాలల విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఔషధ పరిశ్రమ రంగంలో ఉద్యోగావకాశాల గురించి ప్రముఖ ఔషధ సంస్థల ప్రతినిధులు వివరించారు. స్టార్ డీబీటీ కోఆర్డినేటర్ డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ స్టార్ కాలేజ్ స్టేటస్ ప్రోగ్రాం కింద జరిగే అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు విశేషంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ పి.రవిశేఖర్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ సి.నాగేశ్వర్రెడ్డి, డాక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కార్తిక దీప దర్శనం


దేవుని కడప ఆలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న మహిళలు

కడప కల్చరల్: కార్తీక మాసంలో ప్రధానమైనది, పవిత్రమైనదిగా భావించే కార్తిక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం 3.30 గంటల నుంచి ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. ఒకవైపు సన్నగా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా భక్తులు ఉన్నంతలో ఉసిరి దీపాలు, పిండి దీపాలు, వెయ్యి వత్తుల దీపాలు వెలిగించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని శివయ్య, అమ్మవార్లను వేడుకున్నారు. నగరంలోని ఆలయాన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దేవుని కడప సోమేశ్వరాలయంలో న్యాయమూర్తులు శ్రీదేవి, రామారావు దంపతులు గాజుల అలంకారంలో ఉన్న అమ్మవారిని శివయ్యను దర్శించుకున్నారు. జ్వాలా తోరణం వెలిగించారు. ఆలయ ఈఓ ఏ.శ్రీధర్ పర్యవేక్షణలో మృత్యుంజయకుంట ఆలయ ప్రాంగణం ఉదయం, సాయంత్రం భక్తుల కార్తీక దీపాల వెలుగులో కళకళలాడింది. విజయదుర్గాదేవి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన 18 కలశాలతో తెల్లవారుజామున అభిషేకం నిర్వహించారు. శుక్రవారం కావడంతో సుమంగళి పూజ నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిట లాడింది. సాయంత్రం ఆలయ ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. 108 దీపాలతో అమ్మవారికి అష్టోత్తర దీపాలంకరణ పూజలు నిర్వహించారు,


విజయదుర్గమ్మ సన్నిధిలో మహాలింగార్చన చేస్తున్న భక్తులు


దేవుని కడప ఆలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న న్యాయమూర్తి, తదితరులు


మృత్యుంజయకుంట ఆలయంలో దీపానికి మొక్కుకుంటున్న యువతి

పుస్తక పఠనంతో నైపుణ్యం మెరుగు


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సలీంబాషా

కడప కల్చరల్: పుస్తక పఠనంతో నైపుణ్యం మెరుగు పడుతుందని యస్‌కెఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివితే ఏకాగ్రత, కమ్యూనికేషన్ నైపుణ్యం, మానసిక ఒత్తిడి తగ్గి ఆర్యోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి మనిషి మొబైల్ ఫోన్ వదిలేసి పుస్తకాలు చదివితే సామాజిక జ్ఞానం పెంపొందుతుందన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ కొత్త విషయాలు తెలుసుకోవడానికి, వివిధ రంగాలపై అవగాహనా పెంచుకోవడానికి గ్రంథాలయాలు బాగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబేరియన్ పవన్‌కుమార్, నాదెండ్ల బాబి, సురేష్, జేమ్స్, రాజ్ కుమార్, శ్రీనివాసాచార్, మనోహర్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ పార్కులో విరిగిన పరికరం


ప్రమాదకరంగా జారుడు బల్ల

కడప కార్పొరేషన్: కడప నగరం చెమ్ముమియ్యాపేట వద్ద వంతెన కింద నిర్మించిన భగత్ సింగ్ పార్కు అధ్వానంగా మారుతోంది. పిల్లల ఆట పరికరాలు అప్పుడే పాడైపోయాయి. నిర్వహణను పట్టించుకునే వారే లేక ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. జారుడు బల్ల విరిగిపోయింది. పిల్లలు జారేందుకు వెళితే మధ్యలో పడక తప్పదు. ప్లాస్టిక్ కొసలతో కోసుకుపోయే అవకాశం ఉంది. పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వల్లూరు: మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగమ్మతల్లి, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో శనివారం నుండి 3 రోజుల పాటు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని ఏపీఎస్‌ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంకల్పము, గణపతి పూజ జరుగుతుంది. అనంతరం స్వస్తి పుణ్యాహవాచనము, యాగశాల ప్రవేశం, వాస్తు హోమం, అఖండ దీప స్థాపన జరుగుతాయి. సాయంత్రం అంకురార్పణము, జలాధి వాసము, అగ్ని ప్రతిష్ఠ , దీక్షా హోమము జరుగుతాయి. ఆదివారం ఉయదం ప్రధాన కళశ స్థాపన, నవగ్రహ ఆరాధన, వివిధ హోమాలు జరుగుతాయి. యంత్రాభిషేకం అనంతరం గ్రామోత్సవం జరుగుతుంది. సాయంత్రం 3 గంటల నుండి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ, శిఖర కళశ ప్రతిష్ఠ జరుగుతాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుంది. కావున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.